రైతు కష్టాల్లో ఉంటే నాయకుడు ఏం చేయాలి?

కష్టాల్లో ఉన్నపుడే వచ్చి పలకరించాలి. కన్నీరు తుడవాలి. కారణాలు కనుక్కోవాలి. ధైర్యం చెప్పాలి. భరోసా ఇవ్వాలి. అధికారంలో ఉంటే - రైతును గట్టెక్కించే చర్యలు తీసుకోవాలి. విపక్షంలోఉంటే- ఏం చేస్తే రైతులకు మేలు జరుగుతుందో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. ప్రభుత్వం కదలకపోతే.. కదిలేదాకా రైతులతో కలిసి పోరాడాలి.

మరి జగన్‌రెడ్డి ఏం చేశారు?

చిత్తూరు జిల్లాలో మామిడిసీజన్ ముగిసే వేళకి మండీకి వచ్చారు. రైతుల కష్టాలు వినకుండా తన సహజ ధోరణిలో ఉపన్యాసం ఇచ్చారు. మందీమార్బలంతో రెండు గంటలకు పైగా రోడ్డుమీద షో చేసి, అసలు కార్యక్రమంలో అరగంట కూడా ఉండకుండానే హెలికాప్టర్ ఎక్కి ఎగిరి వెళ్లిపోయారు. జగనన్న పర్యటనలో తమ్ముళ్లు రెచ్చిపోయారు. రోడ్లమీదా, మార్కెట్ యార్డు వద్దా నానా బీభత్సం సృష్టించారు. జనాన్ని భయభ్రాంతుల్ని చేసి, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ని చుట్టుముట్టి పిడిగుద్దులు కురిపించి అధికారంలో ఉన్నా లేకున్నా.. మేం మారం ఇంతే అని ప్రకటించుకున్నారు. బంగారుపాళ్యంలో బుధవారం జగన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన పరిణామాల పరంపర ఇది...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జగన్నాటకం



సీన్ 1

హెలికాప్టర్ దిగి మార్కెట్ యార్డుకు బయలుదేరిన జగన్ దారి మళ్లించారు. కారణం హైవే మీద జనం జాడ పెద్దగా లేకపోవడం. బంగారుపాళ్యం పట్టణంలో అయితే ట్రాఫిక్ స్తంభించి జనం ఉన్నట్టుగా కనిపిస్తారు. పోలీసు అధికారులు అనుమతించకపోవడంతో అరగంట వాదించారు. ఎస్పీపై ఆగ్రహం ప్రకటించారు.

సీన్ 2

జగన్ కాన్వాయ్ దగ్గరకు వస్తుండగా వైసీపీ మాజీ సర్పంచి ప్రకాష్‌రెడ్డి తోటలోంచి హఠాత్తుగా ఐదు ట్రాక్టర్లు బయటకు వచ్చాయి. ముందే వాటిని తోతాపురి మామిడి కాయలతో నింపి అక్కడ దాచి ఉంచారు. కాన్వాయ్‌కి ముందు రోడ్డంతా కాయలు పోసుకుంటూ ట్రాక్టర్లు వెళ్లాయి. రైతు కష్టంతో పండిన కాయల్ని తొక్కుకుంటూ జగన్ కాన్వాయ్ ముందుకు దూసుకుపోయింది.



సీన్ 3

బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో వైసీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. పోలీసుల ఆదేశాల్ని ఖాతరు చేయకుండా మూసి ఉన్న ప్రధాన గేటును తోసుకుంటూ యార్డులోకి ప్రవేశించారు. మండీల్లోని మామిడి కాయల్ని తొక్కి ధ్వంసం చేశారు. మార్కెట్‌లో షెడ్లపైకి ఎక్కి హల్‌చల్ చేశారు. బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో రైతులు ఎవ్వరూ కనిపించలేదు. మొత్తం వైసీపీ నాయకులు, కార్యకర్తలే తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

సీన్ 4

ముందే ఎంపిక చేసి రిహార్సల్ చేసుకున్న మండీలోకి జగన్ వెళ్లారు. ఎంపిక చేసుకున్న రైతులతో కాసేపు ముచ్చటించారు. అరగంటకే అక్కడి నుంచి వెనుదిరిగారు.



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి

● మామిడి రైతుల పరామర్శ పేరుతో డ్రామాలు

ఉదయం 5గంటలు: హైవే, గ్రామీణ ప్రాంతాల నుంచి బంగారుపాళ్యం వచ్చే దారుల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఒరిగిపల్లె, మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద నుంచే తనిఖీలు మొదలు పెట్టారు.

ఉదయం 9.00: వైసీపీ కార్యకర్తలు చెక్‌పోస్టుల గుండా కాకుండా రకరకాల దారుల్లో హెలిప్యాడ్ వద్దకు, మార్కెట్ యార్డు దగ్గరకు చేరుకున్నారు.రోడ్ల మీద బైకుల్లో దూసుకుపోతూ, రప్పా రప్పా నరుకుతామని అరుస్తూ హంగామా చేశారు.



రూట్ మార్పొద్దన్న ఎస్పీతో జగన్ వాగ్వాదం

10.30: వైసీపీ శ్రేణులు బంగారుపాళ్యం మార్కెట్‌యార్డు గేట్లను తోసుకుని లోపలికి వెళ్లారు. పోలీసులు చేతులెత్తేశారు.

11.20: జగన్ హెలికాప్టర్ వచ్చి వాలింది. అక్కడ 30 మందికి అనుమతిచ్చినా, 500 మంది లోపలికి చొచ్చుకుని వెళ్లిపోయారు.హెలిప్యాడ్ ప్రాంగణంలో 3 వేలమంది పోగయ్యారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి అదుపు చేశారు.

11.30: ముందుగా వైసీపీ అనుమతి పొందిన మార్గంలో కాకుండా జగన్ కాన్వాయ్ దారి మళ్ళుతోందని తెలిసి చరణ్ దాబా వద్ద ఎస్పీ మణికంఠ జగన్ కాన్వాయ్‌ను అడ్డగించారు. ముందుగా అనుకున్నట్లు హైవే- నలగాంపల్లె ఫ్లైఓవర్ మీదుగా యార్డుకు రావాలని సూచించారు. జగన్ అంగీకరించలేదు. బంగారుపాళ్యం పట్టణంలో నుంచే వస్తానని జగన్ పట్టుపట్టారు. కొంత వాదన జరిగింది. ఎస్పీ ఉన్నా.. కారు ముందుకు పోనివ్వమంటూ డ్రైవర్‌కు జగన్ సూచించారు.

12.00: మరింతమంది పోలీసులతో, వాహనాలతో జగన్ కాన్వాయ్‌కు అడ్డుగా ఎస్పీ నిల్చున్నారు.దీంతో ముందుగా అనుకున్న రూట్ ప్రకారమే హైవే, నలగాంపల్లె ఫ్లైఓవర్ మీదుగా కాన్వాయ్ ప్రయాణం మొదలైంది.

12:30: జనం లేని రోడ్లపై అనుమతి లేకున్నా రోడ్‌షో చేశారు.

12:45: జగన్ రోడ్‌షో ముందుకు రాగానే వైసీపీ మాజీ సర్పంచి ప్రకాష్‌రెడ్డి తన తోటలో దాచి పెట్టుకున్న మామిడి కాయలున్న 5 ట్రాక్టర్లను రోడ్డుమీదకు నడిపించారు. వాటిని రోడ్డుమీద పారబోసుకుంటూ వెళ్లారు.జగన్ కాన్వాయ్, వైసీపీ శ్రేణులు అరుపులు.. ఈలలతో ఆ కాయల్ని తొక్కుకుంటూ ముందుకు సాగాయి.

1.20: బంగారుపాళ్యం పట్టణం పాలూరు క్రాస్ వద్ద కుప్పం వైసీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లోపలికి అనుమతించాలని దబాయించడంతో, పోలీసులు కూడా వారిని వదిలేశారు.

1.40: యార్డు గేటు నుంచి మండీలోకి వెళ్లే వరకు రోడ్‌షో చేసుకుంటూ జగన్ మార్కెట్ యార్డులోకి వచ్చారు.

1.50: ముందుగా ఎంపిక చేసిన మండీలోకి వెళ్లి, ముందుగా అనుకున్న రైతులతో కాసేపు మాట్లాడారు.

2.25: మండీ నుంచి హెలిప్యాడ్ వద్దకు జగన్ బయల్దేరారు.

2.45: హెలికాప్టర్ దుమ్ము మిగిల్చి.. బెంగళూరుకు ఎగిరి వెళ్లిపోయింది.

బతుకుతానని అనుకోలేదు

ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కార్యక్రమం కవర్ చేయడానికి మార్కెట్ యార్డులోని 22వ మండీ వద్దకు వెళ్లా. ఫొటోలు తీస్తున్నా. అంతలో అక్కడున్న కొందరు వీడు ఏబీఎన్ వాడు అంటూ అరిచారు. అంతే నామీద ఒక గుంపు పడిపోయారు. దాదాపు 15 మంది పైనే ఉంటారు. కెమెరా లాక్కుని పగలకొట్టేందుకు ప్రయత్నించారు. అక్కడే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విజయానందరెడ్డి ఉన్నారు. నేను వాళ్లకు తెలుసు. కాపాడతారని అటు పరుగు తీశా. అయినా గుంపు నన్ను విడిచిపెట్టలేదు. మరోసారి దాడి చేశారు. ఊపిరి ఆడలేదు. తల మీదా, వీపు మీదా పిడిగుద్దులు కురిపిస్తున్నారు. బట్టలు చింపి చిందరవందర చేశారు. ఇక అయిపోయింది అనుకున్నా. బతకను అనుకున్నా. ఎక్కడి లేనీ శక్తి తెచ్చుకుని నెట్టుకుంటూ ఆ మూకలోంచి బయట పడ్డా.

- శివకుమార్, ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పోలీసు వైఫల్యం

చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో పోలీసులు ముందుగానే జగన్ పర్యటనకు ఆంక్షలు విధించినా అమలు చేయడంలో దారుణంగా విఫలమయ్యారు. చెక్‌పోస్టులు పెట్టి ఆపారు గానీ, పొలాల్లోంచి వచ్చేవారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేకపోయారు. చెక్‌పోస్టుల వద్ద కూడా దబాయించి మాట్లాడితే వదిలేశారు. మామిడికాయలు రోడ్లమీద పోస్తారని ముందే తెలిసినా అడ్డుకోలేకపోవడం ఆశ్చర్యం. ఇదే జగన్ ప్రభుత్వంలో అయితే ఇలాగే వ్యవహరించి ఉండేవారా అని జనం మాట్లాడుకున్నారు. లోకేశ్ పాదయాత్ర కుప్పం నుంచి మొదలు పెట్టినపుడూ, చంద్రబాబు పర్యటనల్లోనూ పోలీసులు వ్యవహరించిన తీరు గుర్తు చేసుకున్నారు.



ఫొటోలు తీస్తే చంపేస్తారా?

రక్తం రుచిమరిగిన క్రూరమృగం ఎలా ప్రవర్తిస్తుందో వైసీపీ కార్యకర్తలు కూడా అలాగే ప్రవర్తిస్తున్నారు. వైసీపీ మూకలు దాడి చేస్తుంటే పక్కనే ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విజయానందరెడ్డి దగ్గరకు ఆ ఫొటోగ్రాఫర్ వెళ్తే.. మనవాడు కాదని సైగ చేసి మానవత్వం లేకుండా వెళ్లిపోతారా? ఇదేమి దుర్మార్గం?

- మురళీ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

బల ప్రదర్శన కోసమే జగన్ పర్యటన

● రైతులకు ఆయనతో ఎలాంటి లాభంలేదు ● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

● ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యేలు జగన్,మురళి ధ్వజం

చిత్తూరు సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): బల ప్రదర్శన కోసమే మాజీ సీఎం జగన్ మామిడి రైతుల పరామర్శ పేరుతో బంగారుపాళ్యం పర్యటనకు వచ్చారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్ విమర్శించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడుతూ.. జగన్ పర్యటనతో మామిడి రైతులకు ఎలాంటి లాభం లేకపోగా ఆయన బలప్రదర్శన ప్రజలను, రైతులను భయ భ్రాంతులకు గురిచేసే విధంగా ఉందన్నారు. హింసను ప్రేరేపిస్తూ, రాజకీయ లబ్ధికోసమే జగన్ వచ్చారన్నారు. కర్ణాటకలో కేజీ మామిడికి రూ.16 చెల్లిస్తున్నారని తప్పుడుమాటలు చెప్పి మామిడి రైతులను మోసగించారన్నారు. సీఎం చంద్రబాబు రెండు నెలలకు ముందే ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షలు నిర్వహించి మామిడి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా గిట్టుబాటు ధరతో పాటు మామిడి టన్నుకు రూ.4 వేలు సబ్సిడీ ప్రకటించారని చెప్పారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో మామిడి రైతులకు సబ్సిడీ ఇవ్వకపోగా , కనీసం పరామర్శించను కూడా లేదన్నారు. చిత్తూరు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ గూండాలు చేసిన దాడి హేయమైన చర్య అని, దీన్ని అన్ని వర్గాల ప్రజలూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు.మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,ముడా చైర్‌పర్సన్ కటారి హేమలత, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్‌కు పరామర్శ

బంగారుపాళ్యం/చిత్తూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మూకల దాడిలో గాయపడ్డ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే మురళీమోహన్ పరామర్శించారు.డాక్టర్లతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శివకుమార్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి అమానుషమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు.వైసీపీ మూకల దాడికి గురై చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను బుధవారం రాత్రి ఆయన పరామర్శించారు.ఇటీవల జగన్ పర్యటనలో వైసీపీ కార్యకర్తలు హద్దు మీరి ప్రవర్తిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. శివకుమార్‌పై దాడి చేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద తదితరులున్నారు.శివకుమార్‌ను వైసీపీ నేత విజయానందరెడ్డి ఫోన్‌ద్వారా పరామర్శించారు.



శివకుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగన్

వరసిద్ధుడి పాలాభిషేకానికి విరిగిన పాలు

● పక్కన పెట్టిన ఆలయ అధికారులు

● కాంట్రాక్టును రద్దు చేసిన ఈవో

ఐరాల(కాణిపాకం), జూలై 9(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడికి నిర్వహించే పాలాభిషేకానికి బుధవారం సాయంత్రం విరిగిపోయిన పాలు అందాయి. రోజూ ఆలయంలో నిర్వహించే పాలాభిషేకంలో భక్తులు పాల్గొంటారు. బుధవారం సాయంత్రం ఒక భక్తురాలు 10 లీటర్ల పాలు స్వామికి అందిస్తామని ఆలయానికి విచ్చేశారు. పాలాభిషేకం నిర్వహించడానికి క్యూలైన్‌లో నిలబడి టికెట్టు కొనుగోలు చేసి ఆలయం వద్దకు విచ్చేశారు. 10 లీటర్ల పాలు కొనుగోలు చేసిన భక్తురాలు ఆలయంలోకి వెళ్లాక ఆ పాలు విరిగిపోయిన సంగతిని గుర్తించిన అర్చకులు ఈవో పెంచలకిషోర్‌కు తెలియజేశారు. ఆయన విరిగిపోయిన ఆ పాలను బయట పోయించారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం నుంచి ఆలయం వద్ద పాలాభిషేకానికి పాలు విక్రయించరాదంటూ అతడి కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. పాలు సరఫరా చేసే హక్కును ఎవరు కైవసం చేసుకున్నా స్వామికి స్వచ్ఛమైన పాలను అందించాలన్నారు. ఇకపై ఆలయం వద్ద ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.

మామిడి రైతుల సబ్సిడీకి రూ.260 కోట్లు మంజూరు

● మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

చిత్తూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజనులో ఉమ్మడి చిత్తూరు జిల్లా తోతాపురి మామిడి రైతులు ధరల పతనంలో నష్టపోకుండా ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.260 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 76,700 మంది రైతులు 80 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్నారు. ఈ సీజనులో 6.50 లక్షల టన్నుల తోతాపురి మామిడి దిగుబడి వచ్చింది. ఈ మొత్తం సేకరించేందుకు గానూ కిలోకు రూ. 4 వంతున సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం దానికోసం రూ. 260 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి జిల్లా వరకూ చూస్తే 14,582 హెక్టార్లలో తోతాపురి సాగవుతోంది. ఆ మేరకు 1.45 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఈనెల 5వ తేదీ నాటికి జిల్లాలో 10,046 మంది రైతులకు చెందిన 67,988.68 టన్నుల తోతాపురి సేకరించడం జరిగింది. దానికి గానూ రైతులకు సబ్సిడీ కింద రూ. 27.18 కోట్లు చెల్లించాల్సి వుంది. మొత్తం తోతాపురి మామిడి సేకరణ పూర్తయితే సబ్సిడీ కింద రూ. 58 కోట్లు ప్రభుత్వం నుంచీ రైతులకు అందుతుంది.

మెగా పీటీఎంకు పాఠశాలలు సిద్ధం

● ప్రత్యేక అతిథులుగా ప్రజాప్రతినిధులు ● పాఠశాలలో ప్రత్యేక అధికారి నియామకం ● విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై సమీక్ష

● తల్లిదండ్రులకు ఆటల పోటీలు

చిత్తూరు సెంట్రల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో గురువారం నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహణకు సర్వం సిద్ధమైంది.జిల్లాలోని 2984 ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం నిర్వహించనున్నారు.2,60,641 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సుమారు 1.65 లక్షల మంది కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.పచ్చటి తోరణాలతో, రంగవల్లులతో టీచర్లు, విద్యార్థులు పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, జేసీ, డీఈవో, డీవైఈవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు, స్పెషల్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు శాఖల నుంచి ఒక్కో అధికారి ఖచ్చితంగా పాల్గొనాల్సి ఉంది.

తల్లిదండ్రులకు స్వాగత ఏర్పాట్లు

పీటీఎంకు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ముఖద్వారంలో స్వాగతం పలికేందుకు టీచర్లు, విద్యార్థులతో కలిపి కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల వరకు సమాచారం అందించి, ప్రత్యేకంగా ఆహ్వానించారు.పూర్వ విద్యార్థులు, దాతలు హాజరైతే తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పీటీఎం నిర్వహణ, పర్యవేక్షణ, పరిశీలన నిమిత్తం పాఠశాలకో అధికారిని నియమించారు. పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)/ పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ (ప్రైవేటు పాఠశాలలు), సిబ్బందితో కలిపి ప్రారంభించే మెగా పీటీఎంలో స్వాగతం నుంచి ఆ రోజున నిర్వహించే 50 అంశాలను వీరు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.



కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీటీఎం రిహార్సల్

● మెగా పీటీఎం ఇలా

ఉదయం 9-11 గంటలు

విద్యార్థుల సంక్షేమం, అభ్యసనా సామర్థ్యాల పెంపు, ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు, పొందుతున్న లబ్ధి తదితర అంశాలపై సమీక్ష.మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ క్రైం, సోషల్ మీడియా అంశాలపై అవగాహన కల్పించడం.


ఉదయం 11- 11.20 గంటలు : ఆటల పోటీలు

11.30 గంటలు : ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో సమావేశం.

అమ్మ పేరుపై మొక్క

4నుంచి టెన్త్ చదివే విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడం.ఇలా జిల్లావ్యాప్తంగా 98,443 మొక్కలు నాటడం లక్ష్యం.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు సీజే శ్రీరామ్



తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

త్వరలో విజయ్ 'జననాయకుడు'



నిర్మాత ఎన్కే లోహిత్ - ఆశీష్‌రెడ్డి - అన్నామలై

● సినీ నిర్మాత ఎన్కే లోహిత్

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): దళపతి విజయ్ నటిస్తున్న 'జననాయకుడు' సినిమాను త్వరలో విడుదల చేయనున్నట్టు ఆ చిత్ర నిర్మాత ఎన్కే లోహిత్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో తెలుగులో ఓ భారీ చిత్రాన్ని తీయబోతున్నామని, నెలరోజుల్లో ఈ వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. అలాగే, శ్రీవారిని తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేత అన్నామలై, వ్యాసరాజ మఠాధిపతులు విశ్వప్రియ తీర్థ, ఈషాప్రియ తీర్థ, సినీ హీరో ఆశీష్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. 'దేత్తడి' చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభంకానుందని ఆశీష్‌రెడ్డి తెలిపారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,320

తలనీలాలు సమర్పించినవారు: 24,950



పట్టణాలకు మహర్దశ



అమృత్ 2.0 కింద నాలుగు జిల్లాలకు రూ.1622.63 కోట్లు

23 మున్సిపాలిటీల్లో ఇంటింటికి తాగునీరు

టెండర్లు ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్ అధికారులు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనుంది. కనీస మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు చేసేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులు చేపడుతోంది. ఇటీవల ఈ స్థాయిలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరవడం ఇదే ప్రథమం. పబ్లిక్ హెల్త్ విభాగం ఈ పనుల నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం కింద రూ.10,251 కోట్లను మంజూరు చేయగా.. అందులో పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.1622.63 కోట్లను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిధిలోని 23 అర్బన్ లోకల్ బాడీలకు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) నిధులను విభజించారు. ఆయా మున్సిపాలిటీల్లో అవసరాలను బట్టి నిధులు కేటాయించారు. అమృత్ 2.0 పథకం కింద నిధులను మూడు విభాగాలకు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి ఉన్నాయి. ఈ దఫా ఇంటింటికీ తాగునీటిని కుళాయిల ద్వారా ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసమే సింహభాగం నిధులను కేటాయించారు.

అమృత్ 2.0 కింద వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన నిధుల వివరాలు...

మున్సిపాలిటీ	తాగునీటి సరఫరా (రూ.కోట్లు)	మురుగునీటి నిర్వహణ (రూ.కోట్లు)	నీటివనరుల అభివృద్ధి (రూ.కోట్లు)
గూడూరు	26.11	---	4.50
వెంకటగిరి	114.84	---	---
సూళ్లూరుపేట	1.47	----	5
నాయుడుపేట	3.50	----	1.18
చిత్తూరు	29.70	34.43	7.70
శ్రీకాళహస్తి	27.30	11.46	---
పుంగనూరు	14.35	----	----
పుత్తూరు	17.14	--	1.60
నగరి	17.93	---	2.20
పలమనేరు	15.81	---	2.20

రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం

ఈ నాలుగు జిల్లాల పరిధిలో రూ.1622.63 కోట్ల పనులకు పబ్లిక్ హెల్త్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. గత నెల 30న టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 28 వరకూ బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించారు. 23 మున్సిపాలిటీల్లో 73 వర్కులుగా విభజించారు. వాటన్నింటినీ ఒకే ప్యాకేజీగా టెండర్లు పిలిచినట్లు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కాగా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నెల రోజుల్లోపు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆ వెంటనే పనులు మొదలు పెట్టించేలా సన్నాహాలు చేస్తున్నారు.

మీరే వెళ్తారా.. మమ్మల్ని పంపమంటారా?

● టీటీడీలోని అన్యమత ఉద్యోగులకు భానుప్రకాష్‌రెడ్డి హెచ్చరిక

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 'ఇతర దేవుళ్లను పూజించేవారు ఎవరైనా టీటీడీలో ఉంటే స్వచ్ఛందంగా వెళ్లిపోవాలి. లేకుంటే మేమే సాగనంపుతాం' అని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి అన్యమత ఉద్యోగులను ఉద్దేశించి హెచ్చరించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ఏసును ప్రార్థించే వ్యక్తులు టీటీడీలో పనిచేయాల్సిన అవసరం లేదన్నారు. 'స్వామి జీతం తీసుకుంటున్న కొందరు ఉద్యోగులు స్వామి హారతి, ప్రసాదం తీసుకోరు. వారి పేర్లేమో రాముడు, కృష్ణుడు అని ఉంటాయి. కానీ ప్రార్థించేదేమో ఏసుని. ఆ దేవుడిపై ప్రేముంటే ఆ దేవుడి దగ్గరే ఉండండి. మా దేవుడి దగ్గరకు రాకండి' అని అన్నారు. టీటీడీలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఇంట్లో టీటీడీ విజిలెన్స్ విభాగం ద్వారా తనిఖీలు చేయిస్తామని, వారి ఇళ్లలో హిందూ దేవుళ్ల చిత్రపటాలు కాకుండా అన్యమతానికి చెందిన చిత్రపటాలుంటే వారందరినీ ఉద్యోగం నుంచి తొలగించేలా రానున్న బోర్డులో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జనసాంద్రత ఆధారంగా మౌలిక వసతులకు రూపకల్పన

● కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సూచన



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాస్ కటికితల

తిరుపతి(కలెక్టరేట్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనాభా అవసరాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలని.. జనసాంద్రత ఆధారంగా మౌలిక సదుపాయాల రూపకల్పన జరగాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ కటికితల సూచించారు. తిరుపతి నగర సమగ్రాభివృద్ధిపై బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పలుఅంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'నగరాల విస్తరణకు బదులుగా అందులోని ఖాళీ భూముల వినియోగంతో ఎక్కువమందికి సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించండి. ఇదే అభివృద్ధికి సమర్థమైన మార్గం. విస్తృత ఆర్థిక జోన్ అభివృద్ధి ద్వారా తిరుపతి ప్రాంతానికి కొత్త రూపురేఖలను తీసుకురావాలన్నదే లక్ష్యం. పర్యాటకాన్ని కేవలం దర్శనానికే పరిమితి చేయకుండా, రాత్రి వసతితో కూడిన ప్యాకేజీలుగా మార్చడం ద్వారా వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుంది' అని వివరించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడులను ఉపయోగించి వృద్ధి అవకాశాలను అధికంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీనికి విజయవాడలోని కాళేశ్వర్‌రావు.. హైదరాబాదులోని బేగంబజారు మార్కెట్లను ఉదాహరణగా ప్రస్తావించారు. తిరుమల శ్రీవారిని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో పెళ్లిళ్లకు ఇష్టపడతారని, ఈ క్రమంలో నగరాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా భౌగోళిక పరిస్థితులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. జిల్లాలో 25 లక్షల జనాభా ఉంటే, తిరుపతిలోనే 4.5 లక్షలు ఉన్నారన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఇషాకాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, జేసీ శుభంబన్సల్, కమిషనర్ మౌర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడి గర్హనీయం

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్ బంగారుపాళ్యం పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి చిత్తూరు ఫొటోగ్రాఫరు శివకుమార్‌పై వైసీపీ మూకల దాడిని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. చొక్కా చింపేసి విచక్షణారహితంగా కొట్టడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, వి.నరేంద్ర మండిపడ్డారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ దాడిని తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కాళహస్తి గిరిబాబు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీమూకలను అరెస్టు చేయకపోతే ఉద్యమించాల్సి వస్తుందని ఫొటో జర్నలిస్టు అసోసియేన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, లావణ్యకుమార్ హెచ్చరించారు. మీడియా ప్రతినిధులను పార్టీలకతీతంగా చూడాలని, దురుద్దేశంతో దాడులకు పాల్పడడం అనైతిక చర్య అని ఏపీఎంఎఫ్ నాయకులు కల్లుపల్లి సురేంద్రరెడ్డి, డిల్లీబాబురెడ్డి పేర్కొన్నారు.

13న ఐఐటీలో ఇంక్యుబేషన్ కేంద్రం ప్రారంభం

ఏర్పేడు,జూలై9(ఆంధ్రజ్యోతి): ఆహార ప్రాసెసింగ్ రంగంలో యువ ఔత్సాహికులకు వేదికగా సామూహిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఈనెల 13న ప్రారంభించనున్నారు. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కూడా హాజరు కానున్నారు.

వెంకటగిరి నేతన్నకు జాతీయ పురస్కారం



మగ్గం నేస్తున్న శ్రీనివాసులు

వెంకటగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి బొప్పాపురం సాలికాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులు 'సంత్ కబీర్' జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆర్.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన స్వహస్తాలతో చీరపై నేసిన లక్ష్మీవృక్షం డిజైన్ జాతీయ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. ఏటా కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ 15వ శతాబ్దపు ఆధ్యాత్మిక కవి సంత్ కబీర్ పేరిట ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. ఈ ఏడాది వెంకటగిరి నేతన్నకు ఈ అవార్డు దక్కడం విశేషం. ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసులు అందుకోనున్నారు.

విజిలెన్స్ డీఎస్పీ అంటూ వీఆర్వో ఇంట్లో తనిఖీలు

● నకిలీ అధికారులకు రూ.1.20 లక్షలు సమర్పించిన వీఆర్వో


రేణిగుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ డీఎస్పీ అంటూ ఓ వీఆర్వో ఇంట్లో తనిఖీల పేరిట బెదిరించి రూ. 1.20లక్షలు తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ సమీపంలోని జీవాగ్రంలో నివాసం ఉంటున్న భూపతి.. వడమాలపేట మండలం ఎస్వీపురంలో వీఆర్వో. గతంలో ఆయన రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్ పరిధిలో వీఆర్వోగా పనిచేశారు. గత నెల 26న ఈయన ఇంటికి విజిలెన్స్ డీఎస్పీ, కానిస్టేబుళ్లు అంటూ నలుగురు వచ్చారు. గతంలో పనిచేసిన ప్రాంతాల్లో అక్రమాలకు పాల్పడి భారీ ఎత్తున ఆస్తులు కూడబెట్టావని, ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తే నీ ఉద్యోగం పోతుందంటూ బెదిరించారు. ఆందోళనకు గురైన భూపతి వారికి రూ.1.20 లక్షలు ఇచ్చారు. ఇది చాలదని, కొంత సమయం తీసుకుని మరింత నగదు ఇవ్వాలని చెప్పి వెళ్లిపోయారు. వారం తర్వాత నగదు ఇవ్వాలని ఫోన్ చేసి ఒత్తిడి చేయగా, ఆయన తన స్నేహితులకు చెప్పారు. వారి సూచన మేరకు నాలుగు రోజుల క్రితం గాజులమండ్యం పోలీసులకు భూపతి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీఆర్వో ఇంట్లోని సీసీకెమెరా పుటేజీని పరిశీలించారు. నలుగురిని నకిలీ అధికారులుగా గుర్తించారు. భూపతికి చేసిన ఫోన్ నెంబర్ల ఆధారంగా లొకేషన్ ట్రేస్ చేశారు. వారు కర్నూలు, అనంతపురానికి చెందిన వారని పోలీసులు అనుమానిస్తున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

● ఆరుగురి అరెస్టు

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో బుధవారం ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపిన ప్రకారం.. చెంగాళమ్మ ఆలయ సమీపంలోని వాటంబేడు రోడ్డులో అనుమానంగా తిరుగుతున్న కంపా చంద్రకాంత్(సూళ్లూరుపేట), అంకల భరత్ కౌశల్(విజయవాడ), బూరగ తేజ(తడ మండలం వెండ్లూరుపాడు), మండెం శైలేష్(సూళ్లూరు), పరింగి నరేంద్ర (తడ మండలం అనపగుంట), వేనాటి శ్రీహరి (నాగరాజపురం)లను పట్టుకుని పోలీసులు విచారించారు. వారి వద్ద 10 కిలోల గంజాయితోపాటు మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వీరిని పట్టుకునేందుకు సహకరించిన ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, సిబ్బంది గిరీష్‌కుమార్, సురేష్, విజయ్‌ను డీఎస్పీ అభినందించారు.

మరో మైలు రాయిని అధిగమించిన శ్రీసిటీ - వీఆర్వీ పరిశ్రమ



వీఆర్వీ పరిశ్రమ సరఫరా చేస్తున్న భారీ క్రయోజనిక్ ట్యాంకు

● ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి

శ్రీసిటీ. జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని క్రయోజనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ మరో మైలురాయిని అధిగమించింది. ఎయిర్ లిక్విడ్ తయారీలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన (సూపర్ సైజ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంకును ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఎగుమతి చేసిన క్రయోజనిక్ ట్యాంక్ 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగి ఉండడం విశేషం. మంగళవారం ఉదయం 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం ద్వారా ఈ ట్యాంకును కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజనిక్ ఇంధన నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపును వీఆర్వీ పరిశ్రమ దక్కించుకుంది. కాగా దేశంలో దాదాపు 17 సంవత్సరాలుగా నాణ్యత, నూతన ఆవిష్కరణలతో ప్రసిద్ధి చెందుతున్న వీఆర్వీ సంస్థ అమెరికాలోని ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థతో పాటు భారత్‌లోని ఇస్రోకు విశ్వసనీయ భాగస్వామిగా మారింది. కోవిడ్ సంక్షోభ సమయంలో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను వీఆర్వీ సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులతో పాటు తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అందజేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను వీఆర్వీ సకాలంలో సరఫరా చేసి కీలక పాత్ర పోషించింది. కాగా మైలురాయిని అధిగమించిన వీఆర్వీ పరిశ్రమ యాజమాన్యానికి, ఉద్యోగులకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా సార్వత్రిక సమ్మె



నల్లగొడుగులు, నల్లదుస్తులతో నిరసన - సభలో ప్రసంగిస్తున్న సీపీఐ నేత నారాయణ

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో వామపక్షాలు, కార్మిక సంఘాలు బుధవారం జిల్లాలో చేపట్టిన సార్వత్రిక సమ్మె ప్రశాంతంగా జరిగింది. ప్రజా జీవితానికి ఎలాంటి ఇబ్బందీ, అసౌకర్యం కలగని రీతిలో సీపీఐ, సీపీఎం పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. తిరుపతిలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అనుబంధ కార్మిక సంఘాలు జోరుగా ర్యాలీలు నిర్వహించాయి. మానవహారంగా నిలబడ్డారు. అందరూ నాలుగు కాళ్ల మండపానికి చేరుకోగా.. సంయుక్తంగా బహిరంగసభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐఎఫ్‌టీయూ నేత వెంకటరత్నం తదితరులు ప్రసంగిస్తూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికుల పనివేళలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పుత్తూరులో ఎల్ఐసీ ఉద్యోగులు కార్యాలయం మూసివేసి ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వామపక్షాల కార్యకర్తలతో కలసి బ్యాంకులను ముట్టడించారు. ఇలా పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలతో నిరసన తెలిపారు.

కేసు వాదించడానికి వెళ్లి..!

● తిరిగొస్తుండగా ప్రమాదం ● ఇద్దరు న్యాయవాదుల దుర్మరణం

● వీరిలో ఒకరు తిరుపతివాసి



సుబ్రహ్మణ్యం యాదవ్, రాజగోపాల్ (ఫైల్‌ఫొటోలు)

తిరుపతి(నేరవిభాగం)/రాజంపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు వాదించడానికి రాజంపేట వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి, పీలేరుకు చెందిన న్యాయవాదులు సుబ్రహ్మణ్యంయాదవ్(70), నూలివేటి రాజగోపాల్(63) దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. న్యాయవాది సుబ్రహ్మణ్యంయాదవ్ తిరుపతిలోని డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో కాపురం ఉంటున్నాడు. తిరుపతికి చెందిన కుమారస్వామి కేసు వాదించడానికి ఫిర్యాదుదారుడితో పాటు స్నేహితుడు పీలేరుకు చెందిన న్యాయవాది రాజగోపాల్‌తో కలిసి బుధవారం ఉదయం కారులో రాజంపేటకు వెళ్లారు. అక్కడ మధ్యాహ్నం 12.30గంటల వరకు కోర్టులో ఉన్నారు. ఆ తర్వాత తిరుపతికి తిరుగు ప్రయాణంలో రాజంపేట శివారు ప్రాంతంలోని అశోక గార్డెన్ సమీపానికి వచ్చారు. అదే సమయంలో రాయచూరుకు చెందిన వంగాల వెంకటేశ్వర్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, శైలజ, హాసిని, శంకరమ్మ తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో అక్కడికి చేరుకున్నారు. ఆ క్రమంలో వీరి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న న్యాయవాదుల కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు న్యాయవాదులు అక్కడికక్కడే మృతిచెందగా కుమారస్వామితో పాటు మరో కారులోని ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సుబ్రహ్మణ్యం యాదవ్‌కు ముగ్గురు పిల్లలు. ప్రవీణ్‌కృష్ణ దివ్యాంగుడు కాగా, వంశీకృష్ణ తిరుపతిలోని రాయలనగర్‌లో డెంటల్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. కుమార్తె గాయత్రి చంద్రకళ. ఈయన మృతిపట్ల తిరుపతి న్యాయవాదులసంఘం అధ్యక్షుడు గుట్టు గజేంద్ర, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రతి గ్రామానికీ మౌలిక వసతులు

● అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శులు గుర్తించాలి

● తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తుడా పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, కరెంటు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. తుడా పరిధిలో లేఅవుట్ అప్రూవల్, భవన నిర్మాణాల అనుమతులు, అమలు తదితర అంశాలపై 39 మంది ఎంపీడీవోలు, 1100కు పైగా గ్రామపంచాయతీల కార్యదర్శులకు బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత పాలకులు తుడాను భ్రష్టు పట్టించగా.. తాను గాడిలో పెడుతున్నానని తెలిపారు. అక్రమ లేఅవుట్లతో క్రైమ్ రేటు పెరుగుతోందని, ప్రజలు అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు లేఅవుట్, భవన నిర్మాణాల అనుమతులు వాటి అమలు, తుడా నిబంధనలు తెలుసుకోవాలని కోరారు. అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలను గుర్తించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని అమలు చేయాలని తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ కోరారు. తుడాకు, పంచాయతీ కార్యదర్శుల మధ్య ఉన్న సమాచారలోపాన్ని పూరిస్తామన్నారు. అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి? భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను తుడా సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డీపీవో సుశీలాదేవి, డీపీవో సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్, తుడా సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుడా చైర్మన్, జేసీ

మాస్టర్ ప్లాన్‌తో కుప్పం సమగ్రాభివృద్ధి

- పరిశ్రమల స్థాపనతో ఉద్యోగ కల్పన
- ఇంటింటికి 'సుజలం'
- రోడ్లు, కాలువలు, పార్కులన్నీ సుందరీకరణ
- 1200 మందికి పక్కా గృహాలు మంజూరు
- నిరాటంకంగా రోడ్డు విస్తరణ పనులు
- కడా పీడీ వికాస్ మర్మత్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో పక్కా మాస్టర్ ప్లాన్‌తో కుప్పం సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) పీడీ వికాస్ మర్మత్ తెలిపారు.వచ్చే ఏడాది కడా ద్వారా కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు బ్లూ ప్రింట్ విడుదల చేస్తారని చెప్పారు. కడా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఇప్పటికే ఎంవోయూలు కుదుర్చుకున్న పరిశ్రమలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 13 వేల ఉద్యోగాలు వస్తాయన్నారు.1200మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయని, వీరిలో స్థలాలు కలిగిన లబ్ధిదారులు 700 మందికి త్వరలోనే గృహ నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు.ఎన్టీఆర్ సుజల పథకం ఇంకొన్ని రోజుల్లో ప్రారంభించి, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను ఇస్తామన్నారు.రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రతి పంచాయతీకి ఎలక్ట్రిక్ ఆటోలను ఇచ్చి చెత్త సేకరిస్తామన్నారు. పొగురుపల్లె వద్ద వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి, నియోజకవర్గంలోని చెత్త మొత్తాన్ని అక్కడకు చేర్చి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ చేస్తామన్నారు. చెత్త రహిత నియోజకవర్గమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు.నియోజకవర్గంలో మరో 800 డిజిబుల్ పెన్షన్లు త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు.

సింగపూర్ కంపెనీతో మున్సిపాలిటీ అభివృద్ధి

కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు కడా పీడీ తెలిపారు. రాజధాని అమరావతిని డిజైన్ చేసిన సింగపూర్ కంపెనీ ప్రతినిధులతో ఈ ప్లాన్ తయారు చేయిస్తున్నామన్నారు. భూగర్భ మురుగు కాలువల నిర్మాణం, వీధి దీపాలు, టెలిఫోన్ లైన్లు, కరెంటు లైన్లు వంటివన్నీ భూగర్భంలోనే వస్తాయని, ఇందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. డీకేపల్లె పార్కు, ఆర్టీసీ బస్టాండు వద్దగల సెంట్రల్ పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండు, ట్రాఫిక్ కూడళ్లవంటివన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో ఉందన్నారు.

ఎయిర్‌పోర్టు బాధితులకు రూ.25 కోట్లు పరిహారం

నియోజకవర్గంలో నిర్మించనున్న ఎయిర్‌పోర్టు భూసేకరణ 90 శాతం పూర్తయిందని కడా పీడీ తెలిపారు. బాధితులకు వడ్డీతో కలిపి రూ.25 కోట్లు నష్టపరిహారం మంజూరైందన్నారు. ఈ పరిహారాన్ని మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే కుప్పంలోని ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డును 75 అడుగుల మేర విస్తరించనున్నామన్నారు. కోర్టుకు వెళ్లిన వారి విషయంలోనూ కోర్టు సూచించినట్లు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు విస్తరణ పనులు ఆగబోవని పీడీ స్పష్టం చేశారు.

చిన్నపిల్లల్లో వైకల్యాన్ని తగ్గించడానికే డీఈఐసీ


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో వైకల్యాన్ని తగ్గించడానికే జిల్లా సత్వర చికిత్సా కేంద్రం (డీఈఐసీ)ను ఏర్పాటు చేసిన ముఖ్యుద్దేశమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బుధవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డీఈఐసీ)ని ఎంపీ, ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ అధునాతన పరికరాలతో ఉచితంగా చికిత్స పొందవచ్చునన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ సుమారు రూ.178.21 లక్షలతో డీఈఐసీ కేంద్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. 0-18 సంవత్సరాల లోపు పిల్లలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకేసారి 50 మంది పిల్లలకు ఇక్కడ వైద్యం అందించే సౌకర్యాలను ఏర్పాటుచేసినట్లు వివరించారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలో అన్ని సౌకర్యాలతో అధునాతన డీఈఐసీ కేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం పిల్లలతో వచ్చిన తల్లులతో కేంద్రంలోని సౌకర్యాల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి, చుడా చైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం


ఏబీవీపీ విద్యార్థుల ర్యాలీ

చిత్తూరు సెంట్రల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థి సంఘం నేతలు బుధవారం చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద విగ్రహం నుంచి గాంధీ విగ్రహ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యారంగంలోని సమస్యలపై నిత్యం పోరాడుతూ, విద్యార్థులకు న్యాయం చేయడానికి ఏబీవీపీ సంఘం ఆవిర్భావం నుంచి చేస్తున్న కృషిని నేతలు కొనియాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర, పవన్, మోక్షిత్, ప్రశాంత్, రియాజ్, పూర్వ కార్యకర్తలు చిట్టిబాబు, శరత్‌చంద్ర, దేవేంద్ర, రూపేష్, షేక్ రెడ్డి మస్తాన్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా పోలీసుల ఆంక్షలు

- ఇబ్బందులుపడిన సామాన్యులు


అరగొండ ఫ్లైఓవర్ వద్ద బారికేడ్లు పెట్టి ప్రజలను నిలిపివేసిన పోలీసులు

ఐరాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంకు విచ్చేస్తున్న కారణంగా ప్రతి మండలంలో ఎక్కడ చూసినా పోలీసులు ఆంక్షలు పెట్టారు. ఐరాల మండలం నుంచి బంగారుపాళ్యం సమీపంలోని అరగొండ ఫ్లైఓవర్ వరకు సుమారు ఆరు చోట్ల పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టడంతో ప్రజలు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లలేక అవస్థలు పడ్డారు. ఎస్పీ మణికంఠ అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఉండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆస్పత్రికి, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు, పలమనేరుకు వెళ్లేవారు రోడ్డుపై గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడ్డారు. నాలుగు గంటల అనంతరం బారికేడ్లను తొలగించారు. అంత వరకు ప్రజలు తీవ్రంగా అవస్థలు పడ్డారు. జామర్ల కారణంగా చాలా సేపటి వరకు ఫోన్లు పని చేయలేదని పలువురు ఆరోపించారు.

శాకాంబరి అలంకారం కోసం సర్వం సిద్ధం



ఐరాల(కాణిపాకం), జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం శాకాంబరి అలంకారం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. బుధవారం ఈవో మాట్లాడుతూ ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రధాన ఆలయంలోని ధ్వజస్తంభం, అంత్రాలయంతో పాటు అనుబంధ ఆలయమైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో క్యాబేజీ, కాలీఫ్లవర్, బీన్స్, ముల్లంగి, బీట్‌రూట్, గోసు, క్యాప్సికం, దొండకాయ, ఉర్లగడ్డ, కరివేపాకు, స్వీట్ కార్న్, బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, నాటు వంకాయ, బీటీ వంకాయ, కాకరకాయ, నూల్‌కోల్, పచ్చి అరటి, పైన్‌ఆపిల్, ద్రాక్ష, ఆపిల్ కాయలతో సుందరంగా అలంకరించనున్నట్లు తెలియజేశారు. కూరగాయలతో ఆలయాన్ని, అమ్మవారిని అలంకరించడానికి 120 మంది పని చేస్తున్నట్లు చెప్పారు. కూరగాయలను పలమనేరు, కర్ణాటక రాష్ట్రం వడ్డిపల్లె, కోలారు, బెంగళూరు, ముల్బాగిల్, హోసూరు ప్రాంతాల్లోని మార్కెట్ యార్డ్ యజమానులు ఉచితంగా ఆలయానికి అందించినట్లు ఈవో తెలియజేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం :బీజేపీ

చిత్తూరు సెంట్రల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకల దాడి అమానుషమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హేయమైన చర్య: మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

చిత్తూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి):శివకుమార్‌పై దాడి హేయమైన చర్య అని చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వైసీపీ గూండాలపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **ప్రజాస్వామ్యంపై దాడే :** ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణుల దాడి హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. పాత్రికేయులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు.

చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ఖండన

శివకుమార్‌పై దాడి అమానుషమని చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు లోకనాథం అన్నారు. బుధవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్‌ను వారు పరామర్శించారు.జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయడమే దీనికి పరిష్కారమన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.శివకుమార్‌పై దాడికి నిరసనగా చిత్తూరులో గురువారం ఉదయం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.పాత్రికేయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కాశేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, అశోక్, నవీన్, శివప్రసాద్, సురేష్, హేమంత్, రోహిత్ పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరసన

చిత్తూరు సెంట్రల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జయరాజ్, ప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం ముందు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు.దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పాతపేటను వీడని ఏనుగుల గుంపు

- మామిడి, కొబ్బరి, అరటి పంటల ధ్వంసం


ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు - ధ్వంసమైన కొబ్బరిచెట్టు

కల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పది రోజులుగారోజూ రాత్రిసమయంలో గ్రామం వద్దకు చేరుకుంటున్న ఏనుగుల గుంపు మామిడి, కొబ్బరి, అరటి తదితర పంటలను ధ్వంసం చేయడం, నీటి పైపులు, కంచె కూసాలు విరిచేయడంతో రైతులకు అపార నష్టం వాటిల్లుతోంది. మంగళవారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక సమీపం నుంచి బయలుదేరిన 15 ఏనుగుల గుంపు పాతపేట వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శ్రీరాములు, వెంకటాచలం, రామూర్తి, కల్లూరులోని రైతు నవాబ్‌బాషాకి చెందిన మామిడి చెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. రైతు సుబ్రహ్మణ్యంకు చెందిన 20 కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు శ్రీనివాసులుకు చెందిన రాతి కూసాలను విరిచేశాయి. రైతు ఈశ్వర్‌రెడ్డికి చెందిన అనప, రైతు శేఖర్‌కు చెందిన పశుగ్రాసాన్ని తొక్కేశాయి. గ్రామానికి అతి సమీపంలోని రైతు కుప్పయ్యకు చెందిన అరటిచెట్లను తినేసి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్న ఒంటరి ఏనుగు మంగళవారం రాత్రి కోటపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతు గోపి మామిడిచెట్లను ధ్వంసం చేసిన అనంతరం ఎస్సార్ పెట్రోల్ బంకు సమీపంలో కల్లూరు-చిత్తూరు హైవేను దాటుకొని ఎద్దులవారిపల్లి మీదుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక వద్ద ఉన్న 15 ఏనుగుల గుంపులో ఒంటరి ఏనుగు కలిసిపోయింది. దీంతో మొత్తం 16 ఏనుగుల గుంపు బుధవారం పగలంతా గోగులమ్మ వంక వద్ద తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఏనుగుల గుంపు సంచరిస్తున్న అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, తెల్లని దుస్తులు ధరించి ఏనుగులకు కనిపించరాదని, వ్యవసాయ పొలాల్లో రాత్రి వేళల్లో బసచేయరాదని ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు, శ్రీదేవి తెలిపారు.

గజదాడుల నివారణకు చర్యలు

అడిషనల్ పీసీఎఫ్ శాంతిప్రియ పాండే


రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ బృందానికి మ్యాప్ ద్వారా ఏనుగుల సంచార ప్రాంతాల గురించి వివరిస్తున్న డీఎఫ్‌వో భరణి

కుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల దాడుల నివారణకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీఎఫ్) తెలిపారు. రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ టీమ్‌తో కలిసి ఆమె బుధవారం కుప్పం, పలమనేరు నియోజకవర్గాల పరిధిలోని ఏనుగుల సంచార అటవీ ప్రాంతాలను పరిశీలించారు. కుప్పం మండలంలోని గుడుపల్లె మండలంలోని మల్లప్పకొండ ప్రాంతంలో రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ టీమ్ పరిశోధనాత్మక పరిశీలన జరిపింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక కూడలి అయిన కుప్పంలోని పలు సరిహద్దు అటవీ ప్రదేశాలను సందర్శించి ఏనుగులు రాకపోకలు సాగించే మార్గాలు, అవి సంచరించే ప్రదేశాలలో పర్యటించింది. స్థానికుల నుంచి వివరాలను ఆరా తీసింది. ఈ సందర్భంగా పీసీఎఫ్ శాంతిప్రియ పాండే మాట్లాడుతూ ఏనుగుల దాడుల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మూడు రాష్ట్రాల కూడలిలో కుప్పం ఉన్నందున దట్టమైన అటవీ ప్రాంతం ద్వారా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఏనుగులు వలసలు వెళ్లడం, సంచరించడం జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో రైతులు పంటలు నష్టపోవడమే కాక, ప్రాణాలు సైతం కోల్పోవాల్సి వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ బృందం, డీఎఫ్‌వో భరణి, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎలిఫెంట్ గైడ్ రాకేశ్ కాల్వ, కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్, డీఆర్వో సమీర్‌బాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకుంటున్నాం : మంత్రి

చిత్తూరు సెంట్రల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ, చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లాలో గతేడాది తోతాపురి మామిడి 2.5 లక్షల టన్నుల దిగుబడి రాగా, ఈ ఏడాది 6.5 లక్షల టన్నులు వచ్చిందన్నారు. రైతులు ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు కిలోకు రూ.12 మద్దతు ధర ప్రకటించారని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.4 ఇస్తోందని, మిగిలిన రూ.8 గుజ్జు పరిశ్రమల ద్వారా రైతులకు ఇప్పించే ప్రయత్నం జిల్లా యంత్రాంగం చేస్తోందని వెల్లడించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్ర వాటాగా రూ.130 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో ఇప్పటి వరకు 3.08 లక్షల టన్నుల మామిడిని ట్రేడర్లు, గుజ్జు పరిశ్రమల ద్వారా కొనుగోలు చేయించినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో 1.65 లక్షల టన్నులు, తిరుపతి జిల్లాలో 45 వేల టన్నులు, అన్నమయ్య జిల్లాలో 16,400 టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ర్యాంపులు, మండీల ద్వారా మరో 81 వేల టన్నుల మామిడిని ఇతర రాష్ట్రాలకు విక్రయించినట్లు తెలిపారు. మొత్తంగా 50,922 మంది రైతుల నుంచి మామిడి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మామిడి గుజ్జు పరిశ్రమలకు పల్ప్‌పై 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

హెలిప్యాడ్ వద్ద వైసీపీ కార్యకర్తల ఓవరాక్షన్

బంగారుపాళ్యం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం సమీపాన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద వైసీపీ కార్యకర్తలు ఓవరాక్షన్ చేశారు. రోడ్లపై నిలబడి వాహనాలను ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నా.. పోలీసులు చోద్యం చూశారు.జగన్ బుధవారం ఉదయం 10.46 గంటలకు హెలిప్యాడ్‌కు రాగా మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి,మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు స్వాగతం పలికారు.అప్పటిదాకా జగన్ రాకకోసం ఎదురుచూస్తూండిన కార్యకర్తలు ఒక్కసారిగా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసేస్తూ, మరో పక్క దాటి హెలిప్యాడ్ వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో ఓ ఏఎస్పీ స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం జగన్ కాన్వాయ్ ముందుకు సాగింది.జగన్‌ను కార్యకర్తలు కారులో నుంచి దిగమని కోరగా నడిచివెళ్ళేందుకు అనుమతి లేదని ఎస్పీ మణికంఠ తెలిపారు.తిరిగి మధ్యాహ్నం 2.46 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న జగన్ 3.05 గంటకు హెలికాప్టర్‌లో బెంగళూరు వెళ్ళారు.

ఆంక్షలున్నా... ఎలా వచ్చారంటే..

చిత్తూరు అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి):మూడు రోజుల ముందు నుంచి ఎస్పీ మొదలుకుని ఎస్ఐల వరకు 30యాక్టు అమల్లో ఉందని, కాబట్టి జగన్ సమావేశానికి జనం రాకూడదని ఆంక్షలు పెట్టి మహాసముద్రం టోల్‌ప్లాజా, యాదమరి మండలం బుడితిరెడ్డిపల్లె, కాణిపాకం బైపాస్ వద్ద, బంగారుపాళ్యానికి కిలోమీటరు దూరంలో చెకింగ్‌పాయింట్లను ఏర్పాటు చేశారు.అయితే అవేమీ లెక్కచేయని వైసీపీ నేతలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను తరలించారు. చుట్టు పక్కల మండలాలతో పాటు బంగారుపాళ్యం గురించి అవగాహన ఉన్నవారంతా పోలీసుల కళ్లుగప్పి పెద్దఎత్తున మార్కెట్‌యార్డుకు చేరుకున్నారు.బంగారుపాళ్యానికి రెండు మూడు కిలోమీటర్ల దూరంలో కార్లను ఆపి నడకదారిలో మార్కెట్‌యార్డుకు చేరుకున్నారు. వైసీపీ నేతలు సునీల్‌కుమార్, లలితకుమారి, విజయానందరెడ్డి ద్విచక్రవాహనాల్లోనే మార్కెట్‌యార్డుకు వచ్చారు. యార్డు సమీపంలో విజయానందరెడ్డి వాహనాన్ని డీఎస్పీ అడ్డుకోవడంతో ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అలాగే పలువురు మండల స్థాయి నేతలు సైతం పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి : జనసేన,కాంగ్రెస్

వెదురుకుప్పం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడికి పాల్పడిన వైసీపీ గూండాలపై కఠినచర్యలు తీసుకోవాలని మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నేత యుగంధర్ పొన్న డిమాండ్ చేశారు.ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ అల్లరి మూకల దాడి అమానుషమని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు.దీని వెనుక ఉన్న కుట్రదారులపై కూడా చర్యలు చేపట్టాలన్నారు.శివకుమార్‌పై దాడిని జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల,ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గసభ్యులు రమేష్,వెంకటేశులు తదితరులు ఖండించారు.

పల్లం నుంచి పూడికి రైలు మార్గం

- 26 కిలోమీటర్ల మేర సర్వే పనులు ప్రారంభం

ఏర్పేడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు నుంచి పాతవీరాపురం, ఎండీపుత్తూరు మీదుగా వడమాలపేట వద్ద ఉన్న పూడి వరకు (26 కిలోమీటర్లు) కొత్త రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఈ మార్గాన్ని పూడి రైల్వే స్టేషన్‌తో అనుసంధానించనున్నారు. సర్వే పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం రైల్వే అధికారులు ఎండీపుత్తూరు వద్ద స్థల పరిశీలన చేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణానికి భూమి కోల్పోతున్న రైతులతో త్వరలో సమావేశమై పరిహారం తదితర విషయాలను చర్చించనున్నట్లు తెలిసింది.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్నపై చర్యలు తీసుకోండి

- తెలుగు మహిళల ఫిర్యాదు


ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ మహేష్‌కు ఫిర్యాదు చేస్తున్న తెలుగుమహిళలు

చిత్తూరు సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళలు వన్‌టౌన్ సీఐ మహేష్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ప్రసన్నకుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ఆయన చేసిన అశ్లీల పదజాలాన్ని మాజీ సీఎం జగన్ ఖండించపోవడం శోచనీయమని అన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన వైసీపీ నేతలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ మహేష్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ, వరలక్ష్మి, రాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో సరికొత్త రికార్డు

చిత్తూరు సెంట్రల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా విద్యాశాఖ సరికొత్త రికార్డు నెలకొల్పి రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచిందని పాఠశాల విద్య కడప ఆర్జేడీ శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంతటా విద్యార్థులు, ఉపాధ్యాయులు వంద శాతం ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసిన అద్భుతమైన రికార్డు సృష్టించారన్నారు. ఇదే శ్రద్ధ, క్రమశిక్షణతో భవిష్యత్తులో కూడా కొనసాగించాలని సూచించారు. రికార్డుకు కృషి చేసిన డీఈవో వరలక్ష్మి, డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆర్జేడీ అభినందించారు.

భూనిర్వాసితులకు తగిన పరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

గుడుపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో పరిశ్రమలు, రైల్వే లైన్ ఏర్పాటు భూనిర్వాసితులకు ప్రభుత్వం తగిన పరిహారం అందజేస్తుందని జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. గుడుపల్లె మండలం పరిధిలోని పొగురుపల్లె సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసే పరిశ్రమలు, రైల్వే లైన్ ఏర్పాటు భూనిర్వాసితులతో బుధవారం స్థానిక రాళ్లగంగమాంబ ఆలయం కల్యాణ మండపంలో మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూసేకరణతో ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారంతో వేరే చోట భూములను కొనలేమని.. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో అర్హులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎదుట వాపోయారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, తహసీల్దారు సీతారామ్, టీడీపీ మండలాధ్యక్షులు బాబు నాయుడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, నేతలు సుబ్రహ్మణ్యం, గోవింద స్వామి, చంద్రారెడ్డి, చంద్ర, సురేష్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ యానాదికాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త మునిరత్నప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి స్థానిక నేతలతో కలిసి మునిరత్నప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి పెరుమాళ్, నేతలు మునిరెడ్డి, సతీష్, ఆనంద రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌యాదవ్, లింగాపురం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం: కంచర్ల



భూమి పూజ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే కుప్పం నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు పెడుతోందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం రాళ్లబూదుగూరులో తారురోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన ఏడాదిలోనే కుప్పం నియోజకవర్గానికి రూ.1,293 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారన్నారు. అడిగిన వారికి కాదనకుండా సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేశారన్నారు. అనంతరం శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షులు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు పీవీ నాగరాజు, రాజేంద్ర, ఆర్ఎస్ మణి, నాగరాజు, జయరాజ్, బసవరాజ్, కుమార్, మురళీ పాల్గొన్నారు.

రైతులకు జగన్ చేసిందేంటి..? : గౌనివారి

శాంతిపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు జగన్ ఏమి మేలు చేశారో చెప్పగలరా.. అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రశ్నించారు. బుధవారం వెంకటేపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు ఎవరి పాలనలో మంచి జరిగిందో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చర్చకు సిద్ధమా.. అన్నారు. అధికారంలో ఉండగా రైతాంగాన్ని విస్మరించి నేడు రైతులకు ఏదో అన్యాయం జరిగిందంటూ గగ్గోలు పెట్టడం జగన్‌కు తగదని హితవు పలికారు. రైతుల కష్టాలు పట్టించుకోకపోవడంతోనే గత ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేశారని మరిచిపోయారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో దాదాపుగా 13 రకాల పథకాల కింద రైతులకు సాయం అందిందన్నారు. అన్నదాతకు మోసగించిన వైఎస్ జగన్ ఇప్పుడు మామిడి రైతుల పేరిట ఓదార్పుకు వెళితే నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు, రైతులు లేరన్నారు. రైతుల ఓదార్పు పేరిట రాజకీయం చేయడం జగన్ మానుకోవాలని హెచ్చరించారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ నాయకులు తెలిపారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపు మేరకు పులిచెర్ల మండల కేంద్రంలో బుధవారం రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మె నిర్వహించారు. బస్టాండు కూడలిలో మానవహారం చేపట్టారు. అనంతరం పులిచెర్ల తహసీల్దారు జయసింహకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సరస్వతి, ప్రేమలత, మొబీనా, అలివేలు, ఈశ్వరమ్మ, సుజాత, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాంపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భారం తగ్గించాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** ఉద్యోగ, కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం బైరెడ్డిపల్లెలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నిరుపయోగంగా టమోటాల గ్రేడింగ్ యంత్ర సామగ్రి



పలమనేరులో యంత్ర సామగ్రిని పరిశీలిస్తున్న టెక్నీషియన్లు (ఫైల్ ఫొటో)



పలమనేరు మార్కెట్‌యార్డులో వృథాగా టమోటాల గ్రేడింగ్ యంత్ర సామగ్రి

పలమనేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కలికిరి, గుర్రంకొండ, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మార్కెట్లలో రోజూ వందలాది టన్నుల టమోటాలు వస్తుంటాయి. వీటిని కూలీలే గ్రేడింగ్ చేస్తుంటారు. అయితే గంటలోనే దాదాపు టన్ను టమోటాలను గ్రేడింగ్ చేయడానికంటూ ఉత్తర భారతదేశంలో వినియోగించే ఐదు గ్రేడింగ్ యంత్రాలను వైసీపీ హయాంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు తెప్పించారు. ఒక్కో యంత్రానికి రూ.25లక్షలకుపైగా వెచ్చించి.. ఐదు మార్కెట్ యార్డులకు సరఫరా చేశారు. ఈ క్రమంలో పలమనేరు మార్కెట్ యార్డుకు వచ్చిన యంత్ర సామగ్రిని వినియోగించకుండా మూలన పడేశారు. ఈ సామగ్రిని గత ఏడాది జూన్ 20వ తేదీన మార్కెటింగ్ శాఖ జిల్లా ప్రతినిధులు, టెక్నీషియన్లు వచ్చి పరిశీలించి వెళ్లారు. అయితే వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వీటిని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న సలాంసాబ్ తదితరులు

రామకుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం టీడీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి సలాంసాబ్, మాజీ సర్పంచి రామకృష్ణప్ప ప్రభుత్వం అందించే విద్యాకిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు నియాజ్, విజయ్‌కుమార్ రెడ్డి, ఆదిల్, నిసార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నేడు గురుపూర్ణిమ ఉత్సవం

సదుం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సదుం గాంధీ వీధిలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచి తుమ్మల నాగభూషణం రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

సోమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సోమల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీల పురోగతిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి గౌరి

సోమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి గౌరి తెలిపారు. బుధవారం మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి వంట నిర్వాహకులకు సూచనలు చేశారు. సోమల, నంజంపేట అంగన్‌వాడీ కేంద్రాలు, సోమల పీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, సూపర్‌వైజర్ హరిత, ఏపీవో షౌకత్, సిబ్బంది శివయ్య, కుసుమాంబ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు చెన్నకేశవులు

పలమనేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని డిమాండు చేస్తూ అఖిలభారత సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద వామపక్ష నేతలు, కార్యకర్తలు, కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు గిరిధరగుప్తా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు వీఆర్ జ్యోతి, సీపీఐ నాయకులు చెన్నకేశవులు, ఏఐటీయూసీ నాయకుడు మంజునాథ్, చిట్టి, రాజా, ధనమ్మ, సరోజమ్మ, రత్నమ్మ, లలిత, రెడ్డిరాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అన్నదాత-సుఖీభవ జాబితా

పుంగనూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత-సుఖీభవ పథకం జాబితాను గ్రామ సచివాలయాల వద్ద నోటీసు బోర్డులో ఉంచినట్లు ఏడీఏ శివకుమార్ తెలిపారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల వద్ద వెళ్లి వివరాలు తెలుసుకోవడానికి అవకాశం ఉందన్నారు. మనమిత్ర వాట్సాప్ ద్వారా అర్హత కలిగిన రైతుల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. వివరాలకు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పెద్దపంజాణి ఏపీఎంగా నీరజ



పెద్దపంజాణి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండల ఏపీఎంగా బుధవారం టి.నీరజ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేస్తున్న మీరాబాయి గంగవరం మండలానికి బదిలీ కాగా చౌడేపల్లి మండలంలో ఏపీఎంగా పనిస్తున్న నీరజ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న వైద్యాధికారి విజయచందర్

బైరెడ్డిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వైద్యాధికారి విజయచందర్ గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ శాలిని, సావిత్రి, సూపర్‌వైజర్లు, మహతి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబుతోనే కుప్పంలో అభివృద్ధి సాధ్యం



కుప్పంలో దుకాణదారుడికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల



పుంగనూరు మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై ఆరా తీస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం అందించడంతోపాటు అభివృద్ధి చేయడం చంద్రబాబు ఒక్కరికే సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘంలో తాను కుటుంబ సాధికార సమితి సభ్యుడిగా ఉన్న 166వ బూత్ పరిధిలో బుధవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో టీడీపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను వివరించారు. కరపత్రాలు పంచిపెట్టారు. అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **కుప్పం రూరల్‌లో:** కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ టి.సదుమూరు యూనిట్ పరిధిలో బుధవారం కుటుంబ సాధికారథుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబ సారథులు ప్రజలతో నిత్యం అనుసంధానమై ప్రభుత్వ పథకాలను చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో కడా సలహా మండలి సభ్యుడు రామచంద్ర, ఐటీడీపీ శరవణ, పార్టీ నాయకులు చంద్రశేఖర్, విభూషణ్, దామోదర్, మోహన్, తిరుపతి, రమేశ్, చంద్ర, ప్రకాశ్, ఆర్ముగం, నాగార్జున, అశోక్, వెంకటేశ్, సుభాష్, సంతానం, సుబ్రమణి, అన్నాదొరై, రాజ, వెంకటప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని రామకుప్పం మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన రామకుప్పం పట్టణంలోని ఇందిరానగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి సలాంసాబ్, మాజీ సర్పంచి రామకృష్ణప్ప, నేతలు ఆదిల్, బుర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** అభివృద్ధితో పాటు సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిగువపల్లె, చౌడేపల్లెల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పగడాల హరిప్రసాద్, కార్తీక్, గణేష్ పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** పుంగనూరు పట్టణంలోని మంగళంకాలనీ, మదనపల్లె రోడ్డు, దోబీకాలనీ ప్రాంతాల్లో బుధవారం టీడీపీ నాయకులు పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. కౌన్సిలర్ రామకృష్ణమరాజు, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, జ్యోతిరాజు, నాగరాజు, హేమాద్రి, వెంకటరాజు, విజయభాస్కర్ రాజు, హేమంత్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎఫ్ఆర్వో తదితరులు



రామకుప్పంలో రైతులకు నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు బుధవారం నష్టపరిహారం కింద నగదు చెక్కులు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. నలుగురు రైతులకు రూ.60 వేలు విలువ కలిగిన ఈ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో జయశంకర్, డీఆర్వో సమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** కుప్పం నియోజకవర్గ పరిధిలో పంటపొలాలు, తోటలపై గజదాడుల నిరోధానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం రామకుప్పం మండల సచివాలయ సమావేశ మందిరంలో గజదాడుల్లో పంటలు నష్టపోయిన 28 మంది రైతులకు రూ.2,53,400 విలువైన నష్టపరిహారం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు హరీష్, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నాయకులు సీతాపతి, రామ్మూర్తి, గంటప్పగౌడు, మహ్మద్‌రఫీ, గురప్ప, కృష్ణానాయక్, జయశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణప్ప, నాగభూషణం, నవీన్, వెంకటరమణ, కామరాజనాయక్, మనోహర్, రామలింగారెడ్డి, గజేంద్ర, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, ఆదిల్, అవినాశ్‌రెడ్డి, మంజునాథ్, నాగరాజు పాల్గొన్నారు.



నారాయణస్వామి, హరినాథరెడ్డి, నాగరాజు, వెంకటమునిరెడ్డి, ప్రసాద్‌నాయుడు

సహకార సంఘాలకు నూతన కార్యవర్గం ఎంపిక

వి.కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో రెండు సింగిల్ విండోలకు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వి.కోట పీఏసీఎస్‌కు ఛైర్మన్‌గా పి.కొత్తూరుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ నారాయణస్వామిని ఛైర్మన్‌గా, డెరెక్టర్లుగా కృష్ణాపురానికి చెందిన ఎం.మూర్తి, కల్లుపల్లికి చెందిన జయప్పలను ఎంపిక చేశారు. అలాగే ముదరందొడ్డికి చెందిన సీఆర్ హరినాథరెడ్డి ఛైర్మన్‌గా, చింతమాకులపల్లెకు చెందిన రాధాకృష్ణ, కొంగాటానికి చెందిన చిన్నప్పలను డైరెక్టర్లుగా ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లె సింగిల్‌విండో ఛైర్మన్‌గా బేలుపల్లెకు చెందిన టీడీపీ బీసీసెల్ నాయకుడు నాగరాజు, కమిటీ సభ్యులుగా దివాకర్‌రెడ్డి, విశ్వనాథ్ నియమితులయ్యారు. బుధవారం బైరెడ్డిపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

● **పలమనేరు:** పలమనేరు మండలం బయప్పగారిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా మండల తెలుగు యువత అధ్యక్షులు వెంకటమునిరెడ్డి నియమితులయ్యారు. సభ్యులుగా ఎస్.భాస్కర్, వెంకటరామయ్యలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

● **సోమల:** సోమల ఏఎంసీ కమిటీ సభ్యులను ఎట్టకేలకు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమల, సదుం మండలాలకు చెందిన టీడీపీ సానుభూతి పరులను నియమించింది. వైస్ ఛైర్మన్‌గా జి.కుమార్, సభ్యులుగా సీఎం.శ్రీదేవి, జి.సుబ్బరాజ, కె.విశ్వనాథం, కృష్ణప్ప, యువరాణి, పి.ఉమారాణి, కళావతి నియమితులయ్యారు.

● **గంగవరం** : గంగవరం సింగిల్ విండో అధ్యక్షులుగా ప్రసాద్ నాయుడు ఎంపికయ్యారు. వి.రామాపురానికి చెందిన ప్రసాద్ నాయుడు ప్రస్తుతం సింగిల్ విండో అధ్యక్షులుగా ఎంపికయ్యారు.

దాతలచే ఆర్టీసీ బస్టాండులో ఆర్వోప్లాంటు



పలమనేరు ఆర్టీసీ బస్టాండులో దాతలు ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్వో ప్లాంటు

పలమనేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల కోసం శుభ్రమైన నీటిని అందించేందుకు దాతలు ముందుకొచ్చి స్థానిక యూట్యూబర్ లోకనాథం ఆధ్వర్యంలో సుమారు రూ.లక్ష ఖర్చుతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. బుధవారం జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి రాము ప్రారంభించారు. యూట్యూబర్ రామును, సహకారం అందించిన 1983 ఫ్రెండిషిప్ అకాడమి సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టీకే స్వామి, కార్మిక సంఘ అధ్యక్షులు బి.సుధీర్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్, ఫ్రెండ్‌షిప్ అకాడమి సభ్యులు లోకనాథం, శివకుమార్, వాసవిశీన, అబ్దుల్‌సుబాన్, వరద, కరంచంద్, ప్రకాష్, కిట్టి, వేలాయుధం, జయశంకర్, అష్రఫ్, షరీఫ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివశంకర

సోమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ శివశంకర తెలిపారు. బుధవారం సోమల బస్టాండులో వాహనాల తనిఖీ చేశారు. ఈక్రమంలో పలువురు వాహనాలు నడుపుతూ ఫోన్‌లో మాట్లాడటంతో జరిమానా విధించారు. జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై అనధికార స్టిక్కర్లు అతికించుకుని తిరగడం నేరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. అలాంటి వారికి రూ. 10 వేలు అపరాధ రుసుం వసూలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపరాదని సూచించారు. హెచ్‌సీలు రుద్ర, రాజు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన పుంగనూరు బీజేపీ నాయకులు



రాజ్యసభ ఎంపీ సత్యనారాయణను కలిసిన పుంగనూరు బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీ సత్యనారాయణను పుంగనూరు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తిరుమలకు వచ్చిన ఆయన్ను కలిసి పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జదీష్‌రాజు, నానబాల కుమార్, వెంకటరెడ్డి, నాగరాజ, ఉమామహేశ్ పాల్గొన్నారు.

నేడు పుంగనూరులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

పుంగనూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలో గురువారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు సీవీరెడ్డి, శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు వివరించడంతో పాటు సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

పుంగనూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం దారుణమని కాంగ్రెస్ నాయకుడు సజ్జద్, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం బంగారుపాళ్యంలో మామిడి రైతుల పరామర్శకు మాజీ సీఎం జగన్ వచ్చిన సందర్భంగా కవరేజ్ చేస్తున్న ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ కార్యకర్తలు దాడులు చేయడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే అవుతుందన్నారు. అధికారంలో ఉన్న సమయంలోనూ పత్రికా విలేకరులపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేశారని, ప్రస్తుతం దాడులు చేయడంపై కఠినంగా వ్యవహరించి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

శేషవాహనంపై కోదండరాముడి రాజసం

తవణంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శేషవాహనంపై వైభవంగా ఊరేగారు. అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించారు.

కూటమి పాలనలోనే అభివృద్ధి.. సంక్షేమం


మహదేవమంగళంలో కరపత్రాలను పంచుతున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు భరోసా కలిగిందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. గంగాధరనెల్లూరు మండలం తిరువీధికుప్పం, మహదేవ మంగళం పంచాయతీల్లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీనేతలు నిర్వహించారు. అనంతరం జూపల్లెలో దివంగత టీడీపీ నేత గోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, నటరాజ్ మొదలి, హరీష్ యాదవ్, గజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


డైట్‌లో విజేతలకు బహుమతులను అందిస్తున్న అధికారులు

వెదురుకుప్పం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో జిల్లా స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్‌లో విజేతలుగా కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పావని, కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రామకృష్ణ, చిత్తూరు వరదప్పనాయుడు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి మనోజ్‌కుమార్ నిలిచారు. వ్యాసరచన పోటీల్లో గేటు పుత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నవ్య, కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన శశిర, అత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రిషితకు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాన సదస్సును సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాణిపాకం క్రాస్ సమీపంలోని సిద్ధంపల్లె వద్ద గల విఘ్నేశ్వర మహా పిరమిడ్ జ్ఞాన క్షేత్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జ్ఞాన సదస్సులు జరుగుతాయని పిరమిడ్ వ్యవస్థాపకులు గోపాలకృష్ణమూర్తి తెలిపారు.

నేడు మహాభిషేకం

చిత్తూరు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా గురువారం అమ్మవారికి మహాభిషేకం, చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఈవో తిమ్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమిళ సంప్రదాయంలో బుధవారం ఆడి (ఆషాఢ) మాసం ఆరంభమైనందున అమ్మవారికి మహాభిషేకం, చండీ హోమం నిర్వహిస్తున్నామన్నారు.

నింద్ర పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు, శివలింగం, పెరుమాల్‌రెడ్డి

నింద్ర, జూలై 9(ఆంధ్ర జ్యోతి): మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా నింద్ర మండలం మంగళగిరి కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ప్రకటించిందని బుధవారం ఆయన తెలిపారు. డైరెక్టర్లుగా కె.పెరుమాల్‌రెడ్డి(నింద్ర), బి.శివలింగం(మిట్టకండ్రిగ)ను నియమించినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఈ పదవి లభించినందుకు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగిల్ విండో కమిటీ సభ్యుల ఎన్నిక


బాబుయాదవ్, బాబు నాయుడు

విజయపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సింగిల్ విండో (పీఏసీఎస్) అధ్యక్షులుగా కోసలనగరానికి చెందిన బాబు యాదవ్ (కోసలనగరం), కేవీపురానికి చెందిన బాబు నాయుడు (అగరం రామకృష్ణ)ను ప్రభుత్వం ప్రకటించింది. కోసలనగరం పీఏసీఎస్ సభ్యులుగా వరదరాజులు, మురళీ, అగరం రామకృష్ణ, పీఏసీఎస్ సభ్యులుగా వీరరాఘవులు, రవినాయుడులను త్రిసభ్య కమిటీగా నియమించారు. వీరి ఎంపిక పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పార్టీకి సేవచేసినందుకు తగిన గుర్తింపు లభించిందన్నారు.

చెత్త సేకరణపై కేంద్ర బృందం సర్వే

గుడిపాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ, నీటినిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం పట్ల బుధవారం కేంద్ర బృందం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద అధికారులు దామోదరం, రాజేష్ మాట్లాడుతూ చిత్తపార, క్రిష్ణజిమ్మాపురం గ్రామ పంచాయతీలు ఈ సర్వేకి ఎంపిక అయ్యాయని చెప్పారు. ఇందులో భాగంగానే క్రిష్ణజిమ్మాపురంలో సామాజిక మరుగుదొడ్లు, అంగన్వాడీ సెంటర్స్ పారిశుధ్యంపై సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంపూర్ణ, దేవరాజులు, కార్యదర్శి నవీన్, రాజ్‌కుమార్, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై కోదండరాముడి రాజసం



తవణంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు శేషవాహనంపై వైభవంగా ఊరేగారు. అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు ఊంజల్‌సేవ నిర్వహించి, శేషవాహనంపై మేళతాళాల నడుమ టి.పుత్తూరు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్దేశ్వర్‌రెడ్డి, ఉభయదారులతో పాటు టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి పూజలు ఆరంభం


షిరిడీ సాయిబాబాకు పాలాభిషేకం చేస్తున్న సీకే బాబు

చిత్తూరు కల్చరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టమంచి షిరిడీ విశ్వసాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి పూజలు భక్తి ప్రపత్తులతో ఆరంభించారు. స్వామి వారికి ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతులు పాలాభిషేకం, కాకడ హారతి, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతి, శేజ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నదాత సుఖీభవ నమోదుకు 13 వరకు గడువు


గుడిపాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఈనెల 13వ తేదీలోపు అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి సంగీత తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇంకా నమోదు చేసుకోని రైతులు వెంటనే గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని, ఇప్పటికే పథకంలో నమోదైన రైతుల జాబితాలోతమ పేరును పరిశీలించుకోవాలని ఆమె కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం చేస్తున్న పోలీసు అధికారులు

శ్రీరంగరాజపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వినోద్(43) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. చిత్తూరు ఆర్‌వీఎస్‌నగర్‌లో ప్రదీప్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, సభ్యులు ప్రదీప్ సతీమణి భువనేశ్వరికి ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్, అంత్యక్రియల ఫండ్ కలిపి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్‌ఆర్ ప్రభుత డిగ్రీ కళాశాలలో బుధవారం వన్ మిలియన్ వన్ బిలియన్ జాబ్ స్కిల్స్, డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం టెక్నాలజీతో పాటు ఉద్యోగ నైపుణ్యాలను కూడా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

గర్భిణులకు పండ్ల పంపిణీ



తవణంపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులకు మండలంలోని అపోలో హాస్పటల్ యాజమాన్యం పండ్లు, ఆపిల్ జ్యూస్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్‌లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రియాంక, అపోలో పీఆర్వో కమరుద్దీన్, వైద్య సిబ్బంది జ్ఞానశేఖర్, రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విజయపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహావీరపురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం 34 మంది విద్యార్థులకు నగరి రవి స్టోర్ యజమాని రవి, విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య చేతుల మీదుగా క్రయాన్స్, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు తన వంతు సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తమిళనాడుకు విచ్చలవిడిగా గ్రావెల్ తరలింపు

● పట్టించుకోని అధికారులు


వనదుర్గాపురం నుంచి అక్రమంగా తమిళనాడుకు తరలుతున్న గ్రావెల్

పాలసముద్రం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం నుంచి గత కొన్ని నెలలుగా వనదుర్గాపురం, సింహరాజుపురం, గంగమాంబాపురం పంచాయతీల్లోని గుట్ట ప్రాంతాల నుంచి ఎర్రమట్టి గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా తమిళనాడుకు తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య వర్గ పోరాటం వైసీపీ వారికి బలంగా మారుతోంది. కొందరు ప్రతిపక్షానికి చెందిన వైసీపీ నాయకులు ఈ అక్రమ దందా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా నిర్వహించే వైసీపీ నేతలకు మండల అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రావెల్ తరలించే మూడు ప్రాంతాలు తమిళనాడుకు అతి సమీపంలో ఉండటం వలన తమిళనాడులో ఎర్రమట్టి, గ్రావెల్ ఒక్కొక్క ట్రాక్టర్ రూ.నాలుగు వేలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజుల్లో రాత్రి పూట ఎక్కువగా తరలించి తమిళనాడులో విక్రయిస్తున్నారు. ఈ దందాకు అడ్డుకట్ట వేయవలసిన అధికారులు అక్రమార్కుల ద్వారా వచ్చే కాసుల కోసం కక్కుర్తిపడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందా గురించి బుధవారం వనదుర్గాపురం వాసులు జిల్లా కలెక్టర్‌కు, జీడీ నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ఫిర్యాదు చేశారు.



నగరిలో మానవహారం ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, చిత్తూరు పోస్టల్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల ప్రతినిధుల ధర్నా

కొత్తగా తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలి

● ఏఐటీయూసీ, సీఐటీయూ డిమాండ్

నగరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా తీసుకొచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం నగరిలో టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపిన అనంతరం మానవహారంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వేలన్ మురళి, బాషా, రాము, దశరథ, తంగరాజ్, సందీప్, ముత్తు, సురేష్, రాజ్‌కోటి, కుమరేశన్, కార్మికులు పాల్గొన్నారు.

● వెదురుకుప్పం (ఆంధ్రజ్యోతి): కార్మికులు ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కొనసాగించాలని, స్కీంకార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ ఆశా వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షురాలు గీత, ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గీత, లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం స్కీం కార్మికులకు వేతనాలు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని దశల వారీ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వెదురుకుప్పం తహసీలార్ బాబుకు, ఎంపీడీవో కార్యాలయంలో ఏవో నాగమణికి, పోలీసుస్టేషన్‌లో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చారు.


వెదురుకుప్పం తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న గీత, లక్ష్మీనరసమ్మ

● విజయపురం (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. విజయపురంలో కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రవి, కార్యదర్శి ఏసుపాదం, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు లక్ష్మీ, సంపూర్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

● చిత్తూరు (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సమాఖ్య కేంద్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం జిల్లా కేంద్రమైన చిత్తూరు హెడ్ పోస్టాఫీసు వద్ద పోస్టల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, కారుణ్య నియామకాలలో ఐదు శాతం సీలింగ్ ఎత్తి వేయాలని, కంటింజెంట్, జీడీఎస్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ భాస్కర్, రామమూర్తి శెట్టి, మహాదేవన్, సర్దార్, ప్రసాద్, సుధాకర్ నాయుడు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం


శివకుమార్‌ను పరామర్శిస్తున్న మురార్జీ యాదవ్

యాదమరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం రైతు మార్కెట్ యార్డు సందర్శన కోసం వచ్చిన మాజీ సీఎం జగన్ ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై బుధవారం వైసీపీ అల్లరి మూకల దాడిని యాదమరి టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, నాయకులు హేమగిరి, వల్లేరు అమరనాథ నాయుడు తదితరులు తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. గాయపడ్డ శివకుమార్‌ను బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు.

మీడియాపై దాడి చేయడం తగదు

గుడిపాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలో బుధవారం మాజీ సీఎం జగన్ పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైకాపా అల్లరి మూకల దాడి అమానుషమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వైకాపా అల్లరి మూకలు హేయమైన దాడులను అలవాటుగా చేసుకొన్నాయని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. వాసురెడ్డి, సుమతి, మురళి తదితరులు కూడా ఖండించారు.

కృష్ణారెడ్డి సేవలు అభినందనీయం


కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న సిబ్బంది

యాదమరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన గడ్డం కృష్ణారెడ్డి సేవలు అభినందనీయమని ఎంఈవో రుక్మిణి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని హైస్కూల్లో ఆయన్ను సత్కరించారు. విద్యాబోధనతో పాటు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థికి రూ.20 వేలు నగదు బహుమతిని కృష్ణారెడ్డి అందించారు. యాదమరి పాఠశాలలో బాలబాలికలకు నీడనిచ్చే సాయి విద్యా ప్రాంగణాన్ని రూ.7.50 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణు, తహసీల్దార్ పార్థసారథి, టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ్ నాయుడు, రవి, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు హేమలత, గిరిరాజ, దూర్వాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దాం


పాదరక్షలు అందిస్తున్న వైద్యులు

నింద్ర, జూలై 9(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దామని డాక్టర్ వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీలకు సంబంధించిన వైద్యులు వెంకటప్రసాద్ నింద్ర పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం లెప్రసీ వైద్యశాలలో 30 మందికి పాదరక్షలు, అల్సర్ కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.బి.వినీషా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గోపీ, డీపీఎంవో కె.శ్రీదేవి కానీక్‌రాజ్ ఆరోగ్య పర్యవేక్షకులు సురేష్, ఓపీ స్టాఫ్, ఏఎన్‌ఎంలు, స్కోప్ వాలంటీర్స్ గిరిబాబు, థెరిసా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నగరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం గుండ్రాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నీరజాక్షి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తలిదండ్రులచే సన్మానించబడటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచి బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై సమగ్ర సర్వే నిర్వహించాలి


బూత్ లెవెల్ అధికారులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

వెదురుకుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదులో తొలగింపు, మార్పులు లాంటి వాటిపై బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు ఫాం-7పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆ తర్వాత బూత్ లెవెల్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా సమగ్రమైన పరీక్ష విధానాన్ని నిర్వహించారు.

సంక్షేమం.. అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నేతలు

నగరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం.. అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నగరి టీడీపీ నాయకులు అన్నారు. నగరి మండలంలోని దేశూరు అగరం పంచాయతీలోని అర్జునయ్యకండ్రిగలో బుధవారం టీడీపీ నగరి మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. దేశూరుఅగరం పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏలుమలై, శరత్‌బాబు, సెల్వమణి, నాయకులు పాల్గొన్నారు.

పచ్చి మేతతోనే రైతులకు పోషణభారం తగ్గింపు


రెడ్డేపల్లెలో రైతులతో మహమ్మద్ ఆరీఫ్

గంగాధరనెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాడి ఆవులకు పచ్చిమేత కొదవలేకుండా మేపినప్పుడే రైతులకు పోషణభారం తగ్గుతుందని పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జేడీ మహమ్మద్ ఆరీఫ్ అన్నారు. పశుగ్రాసం వారోత్సవాల్లో భాగంగా గంగాధరనెల్లూరు పంచాయతీ నాగన్నకండ్రిగ, రెడ్డేపల్లెలో బుధవారం పశుసంవర్థక శాఖ అధికారులు, రైతులతో కలిసి గ్రాసం పెంచిన పొలాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాడిఆవుల పశుగ్రాసం అవసరాలను తీర్చడానికిగాను ఉపాధిహామి పథకంలో 100శాతం రాయితీపై పశుగ్రాసాలను పెంచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జీడీనెల్లూరు ప శు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాస నారాయణి సేవ

చిత్తూరు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బుధవారం మాస నారాయణీ సేవ ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు నగరంలో ప్రభుత్వాస్పత్రి, చర్చివీధి, గాంధీచౌక్, లెప్రసీ కాలనీల్లో పేదలకు భోజన పొట్లాలు, తాగు నీరు పంపిణీ చేశారు. సమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం, ప్రభాకర్ నాయుడు, దేవరాజులు, శివప్రకాష్, కృష్ణమ నాయుడు, గజేంద్రరెడ్డి, చిన్నబ్బ పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఐడీ ఎందుకు తొలగించారు..?

గంగాధరనెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి తనపేరుతో ఇన్‌స్టాగ్రామ్ లేదని రెండురోజుల క్రితం చెప్పారని, అలాంటప్పుడు కళత్తూరు కృపాలక్ష్మి ఐడీని అఫిషియల్ పేజీ నుంచి ఎందుకు తొలగించారని నియోజకవర్గ జనసేన కన్వీనర్ పొన్నా యుగంధర్ ప్రశ్నించారు. గంగాధరనెల్లూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫేక్ ఐడీ అయితే ఎందుకు తొలగించాల్సి వచ్చింది.. మళ్లీ రెండు ఐడీలు ఎందుకు కొత్తగా క్రియేట్ చేశారని ప్రశ్నించారు. మీపేరుతో గల ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా పవన్‌కల్యాణ్‌పై పోస్ట్‌చేసిన అనుచిత వ్యాఖ్యలపైనే తాము పోలీసులను ఆశ్రయించి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సురేష్‌రెడ్డి, చిరంజీవి, శ్రీనివాసులు, పద్మ, సెల్వి, లక్ష్మీ, రాఘవ, మహేష్, విజయ్, చార్లీష్ పాల్గొన్నారు.